## క్లుప్తంగా

### విధులు బహిష్కరించిన న్యాయవాదులు

మిర్యాలగూడ టౌన్ : కూకట్‌పల్లి బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది తన్నీర్ శ్రీకాంత్‌పై దాడిని ఖండిస్తూ రాష్ట్ర బార్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేతి సత్యనారాయణ, అలుగుబెల్లి భూపతిరెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుండి శ్రీనివాస్‌తో పాటు జూనియర్, సీనియర్ న్యాయవాదులు తదితరులున్నారు.

### రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర్‌రాజు సందర్శించారు. ముందుగా పోలీస్ స్టేషన్ ముందు సిబ్బంది ఫరేడ్‌తో పాటు కిట్ బాక్స్, సిబ్బంది స్మాల్ సర్వీసు బుక్‌లతో పాటు సిబ్బంది ఆరోగ్య పరిస్థితి, సంరక్షణ, తదితరర సమస్యలను అడిగి తెలుసుకొని స్టేషన్‌కు సంబంధించిన అన్ని కేసుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు అదే విధంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఆయన వెంట మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, రూరల్ ఎస్‌ఐలు మల్లికంటి లక్ష్మయ్య, సైదులు, లింగారెడ్డి, ఏఎస్ఐ రాములునాయక్‌లతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

### పెద్దవూర ఎంఈఓకు సన్మానం

మిర్యాలగూడ టౌన్ : ఇటీవల ఉత్తమ ఎంఈఓగా అవార్డు అందుకున్న పెద్దవూర ఎంఈఓ బాలాజీనాయక్‌ను మంగళవారం రాత్రి స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బీసీఈ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు గోపీనాయక్, కాశీయాదవ్, అంబటి శ్రీనివాస్, సైకిలాబ్, వీరనారాయణ, విష్ణుకుమార్, పంతులునాయక్, సీతారాంనాయక్, సైదులు, వీరశేఖర్, వెంకట్, గోషిక , దయాకర్, తోట యోగేందర్, చంద్రయ్య, భగవాన్‌నాయక్,, నాగరాజు, సైదానాయక్ తదితరులున్నారు.

### ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మూతబడిన పాఠశాలలో ఉపాధ్యాయుడు పనిచేస్తున్నట్లు తప్పుడు హాజరు ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన కాంప్లెక్స్ హెచ్‌ఎంపై విచారణ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ నాయకులు మంగళవారం ఎంఈఓ శ్రీనివాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కోశాధికారి వద్యా రాజు మాట్లాడారు. మండలంలోని నెల్లికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లేని కారణంగా గతేడాదే మూతబడినట్లు తెలిపారు. శాలిగౌరారం మండలం ఊట్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు మూతబడిన పాఠశాలలో పనిచేస్తున్నట్లు తప్పుడు ధ్రువపత్రం మంజూరు చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్ ఎరనాగుల సైదులు, సంఘం నాయకులు వినయ్‌కుమార్, నాగమణి, అంజిబాబు, శైలజ పాల్గొన్నారు.

### గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

త్రిపురారం : గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బొర్రాయిపాలెంలో రూ. 12లక్షల నిధుల వ్యయంతో నిర్మించనున్న నూతన అంగన్ వాడీ భవనానికి భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, బిట్టు రవి కుమార్, అనంత రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పెద్దఅడిశర్లపల్లి : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పెద్దఅడిశర్లపల్లి ఎంఈఓ వెంకటయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 29న కబడ్డీ, ఖోఖో ఆటల్లో బాలురకు అండర్- 14 సెలక్షన్స్, 30న కబడ్డీ, ఖోఖో ఆటల్లో బాలికలకు అండర్ 14 సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్లయ్య, మల్లేష్, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, జీవన్‌కుమార్, శ్రీనయ్య ఉన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

కొండమల్లేపల్లి (చింతపల్లి) : మండలంలో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్య, రోడ్డు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చింతపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు సముద్రాల నగేష్, చెనమోని రాములు, అనిత, కుకుడపు రామకృష్ణ, ఎర్ర వెంకటయ్య పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాల ఏర్పాటుకు కృషి


మిర్యాలగూడ టౌన్: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, తదితరులు


దేవరకొండ : మట్టి వినాయకుడి ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, తదితరులు

మిర్యాలగూడ టౌన్ : వచ్చే మూడేళ్లల్లో మున్సిపాలిటీలో వందశాతం మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా మున్సిపల్ శాఖ మట్టి విగ్రహాలను అందించనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాదిలో మొదటి విడతగా మున్సిపాలిటీలో 25శాతం వరకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసే విధంగా వినాయక ఉత్సవాలకు ముందే అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థలతో పాటు అన్ని వర్గాలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీ ద్వారా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తాన న్నారు. మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ కె.రాజశేఖర రాజు, ఆర్‌ఓ జ్ఞానేశ్వరీ, పర్యావరణ ఇంజనీర్ శ్వేతారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రేపాల పురుషోత్తంరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, నాగలక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాదిల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు జానకిరాంరెడ్డి, గోవర్ధనాచారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, టీపీఎస్ సోమయ్యలతో పాటు ఆర్‌పీలు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**

దేవరకొండ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రజలకు ఆయన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఆనందోత్సాహాల నడుమ ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. వినాయకుడి మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, కమిషనర్ సుదర్శన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కొండ్ర శ్రీశైలంయాదవ్, ఎండీ యూనూస్, పాన్నెబోయిన సైదులు, ప్రదీప్, జయప్రకాశ్, వస్కుల సుధాకర్, గాజుల మురళి, బత్తుల అమర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


గుర్రంపోడు : కొప్పోలు రామాలయంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ


చింతపల్లిలో మట్టి గణనాథులను అందజేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామంలోని రామాలయంలో కస్తూరి ఫౌండేషన్ వారి సౌజన్యంతో మంగళవారం మట్టి విగ్రహాలను ఎస్‌ఐ మధు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఇందుకు ఇంటింటా మట్టి గణపతి ప్రతిమలను పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి (చింతపల్లి) : చింతపల్లి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో మంగళవారం మండల కేంద్రంలో మట్టి గణనాథులను ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి గణనాథులను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామ్మూర్తి, చెట్లహరి ప్రసాద్, సముద్రాల నగేష్, దాచేపల్లి మధు, జెల్లా యాదగిరి, కొమిరిశెట్టి వినోద్, కొర్వి యాదగిరి, కోటేష్ పాల్గొన్నారు.

# గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే బాలునాయక్


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం చందంపేట మండల కేంద్రంలో జనహిత కార్యక్రమంలో భాగంగా పలు వీధుల్లో మార్నింగ్ వాక్ నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా వారితోనే మాట్లాడి తెలుసుకున్నారు. అధికారులు గ్రామ స్థాయిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో డ్రెయినేజీ, కరెంట్, వీధిలైట్లు, రహదారుల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం చందంపేట ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ జమున మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొండ్ర శ్రీశైలంయాదవ్, వెంకయ్య గౌడ్, బద్యానాయక్, సురేష్‌గౌడ్, గోవిందుయాదవ్, కిన్నెర హరికృష్ణ, సర్వయ్య, అనంతగిరి, శంకర్‌రావు, సాధిక్, నజీర్, ఖరీం, మమ్ము పాల్గొన్నారు.

# యూరియా కొరతకు కాంగ్రెస్సే కారణం


మాట్లాడుతున్న గోలి మధుసూదన్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చిన యూరియా పక్కదారి పట్టడంతోనే కొరత ఏర్పడిందని, దీనికి కాంగ్రెస్ పార్టీనే కారణమని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మార్క్‌ఫెడ్‌తో పాటు తదితర ప్రాంతాలను పరిశీలించిన అనంతరం రైతు వేదిక వద్ద వ్యవసాయ శాఖ అధికారరులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం యూనియన్ గవర్నమెంట్‌ను బద్నాం చేస్తుందని ఆరోపించారు. యూనియన్ గవర్నమెంట్ నుంచి పెద్ద మొత్తంలో రాష్ట్రానికి యూరియా వచ్చినప్పటికీ యూరియా కొరతను సృష్టించి బీజేపీ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, బంటు సైదులు, జిల్లా కోశాధికారి తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా కోశాధికారి కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, బండారు ప్రసాద్, సీతారాంరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభి, జువ్వాది సత్యనారాయణ, నవీన్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

# గంజాయి రవాణా చేస్తున్న నిందితుల అరెస్ట్

- 1350 గ్రాముల గంజాయి, 22 చాక్లెట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ టౌన్ : అక్రమ గంజాయి రవాణా చేస్తున్న నిందితులను మాడుగుపల్లి పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన రాజకుమార్ పటేల్, సికిందర్‌లు మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురంకు చెందిన ఎస్‌కె సమీర్‌ను పరిచయం చేసుకొని అతడి ద్వారా మిర్యాలగూడ, మాడ్గులపల్లి పరిసరాల ప్రాంతాలకు చెందిన యువతకు విక్రయిస్తున్నారు. సమీర్‌తో పరిచయం పెంచుకున్న సికిందర్, రాజకుమార్ పటేల్, కొండేటి యశ్వంత్ అలియాస్ చింటు, కొడేల శివ, బొల్లంపల్లి విష్ణు, కొండేటి బుర్రి లోకేష్, దైద సందీప్, గుండెబోయిన వంశీ, పందిరి చరణ్, మిర్యాల వివేకానందరెడ్డి, బుర్రి నవీన్, శివం ఫార్మా కంపెనీ డైరెక్టర్ ఉన్నావ్‌లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. మాడుగులపల్లి, మిర్యాలగూడ ప్రాంతాలకు చెందిన కొంత మంది వీటికి బానిసలైన యువతకు విక్రయిస్తున్నారు. ఈనెల 25వ తేదిన మాడుగులపల్లిలోని పాత రైల్వే స్టేషన్ క్వార్టర్ వద్దకు గంజాయి, గంజాయి చాక్లెట్లను తీసుకువెళ్లి కొంత మంది యువకులకు అందిస్తుండగా నమ్మకమైన సమాచారం మేరకు మాడుగులపల్లి పోలీస్‌లు దాడి చేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 1350 గ్రాముల గంజాయి, 22 గంజాయి చాక్లెట్లు, మూడు ద్విచక్ర వాహనాలు, 8సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో మొత్తం 13మంది నిందితులను గుర్తించగా వీరిలో ముగ్గురు పరారీలో ఉండగా 10మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు పర్యవేక్షణలో కేసును చేధించారు. కేసు చేధించిన మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, మాడుగులపల్లి ఎస్‌ఐ కృష్ణయ్య, ఏఎస్‌ఐలు నర్సింహారావు, జాఫర్, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు ఎస్ సైదులు, ఎం సైదిరెడ్డి, పి. అనిల్, ఎస్.అంజనేయులు, వై యాదయ్య, జి నరేష్, సైదులు, శ్రీనునాయక్‌లతో డ్రైవర్ సురేష్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# నూతన భవనానికి ప్రతిపాదనలు పంపాం

- నిడమనూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్


నిడమనూరు స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నిడమనూరు : నిడమనూరు నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపారు. మంగళవారం నిడమనూరు పోలీస్ స్టేషన్ ఆయన సందర్శించారు. పాత పోలీస్ స్టేషన్‌ను శిథిలావస్థకు చేరడంతో పాత కోర్టు భవనంలోకి పోలీస్ స్టేషన్‌ను మార్చారు. ఆ భవనాన్ని ఎస్పీ పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్, లాకప్ గదులు, కంప్యూటర్ గదిని, జనరల్ డైరీ, ఇతర రికార్డులను ఎస్పీ పరిశీలించారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, స్థానిక నాయకులు ఎస్పీకి పూల మొక్క అందజేశారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మొక్కను నాటారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ సతీష్‌రెడ్డి, ఎస్‌ఐ ఉప్పు సురేష్ తదితరులు ఉన్నారు.

### మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం

హాలియా : హాలియా మున్సిపాలిటీ నుంచి విడిపోయిన ఇబ్రహీంపేట గ్రామాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) వెంకయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీఈఓ కార్యాలయంలో కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీడీఓ లక్ష్మి కలిసి సమీక్ష నిర్వహించారు హాలియా మున్సిపాలిటీ నుంచి విడిపోయిన ఇబ్రహీంపేట గ్రామ పంచాయతీకి మున్సిపల్ నుంచి రావాల్సి ఆస్తులు, సిబ్బంది, రికార్డుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీపీఓ వెంకయ్య మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు ఇబ్రహీంపేట గ్రామ మౌలిక ఏర్పాట్ల పర్యవేక్షణను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి విధివిధానాలు వచ్చే వరకు హాలియా మున్సిపాలిటీ నుంచి విడిపోయి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన ఇబ్రహీంపేట పర్యవేక్షణ పురపాలిక అధికారులే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట పలువురు అధికారులు తదితరులు ఉన్నారు.

### న్యాయవాదులకు హెల్త్‌కార్డులు పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా జారీ చేసిన హెల్త్‌కార్డులను మంగళవారం మిర్యాలగూడ బార్ అసోసియేషన్ భవనంలో న్యాయవాదులకు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేతి సత్యనారాయణ, అలుగుబెల్లి భూపతిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుండి శ్రీనివాస్, కోశాధికారి సాయికుమార్ యాదవ్, సహాయ కార్యదర్శి పద్మయ్య, న్యాయవాదులు కంభం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లేపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన కల్మచెరువు గురులింగ తండ్రి కల్మచెర్వు అంజయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మంగళవారం మృతుడి నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ డైరెక్టర్ నరసింహారెడ్డి

పెద్దవూర : మండలంలోని పెద్దవూర, చలకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 20మంది విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్) స్టడీ మెటీరియల్‌ను పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సింహారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మారుమూల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యాభివృద్ధికి పల్‌రెడ్డి ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. ప్రతి ఏటా గురుకుల ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఫ్రీ కోచింగ్‌తో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను, ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు సైతం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తరి రాములు, ఝూన్సీ, ఉపాధ్యాయులు వెంకటరమణ, ప్రమీల, పద్మ, శోభారాణి పాల్గొన్నారు.

హాలియా : స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ హాలియా, ఎమ్మారీ హైస్కూల్ విద్యార్థులకు పల్‌రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ నరసింహరెడ్డి మంగళవారం స్టడీమెటీరియల్స్, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# వైటీపీఎస్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకే కాకుండా దామరచర్ల మండల వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైటీపీఎస్ పూర్తి కావొస్తున్న నేపథ్యంలో కేవలం భూములు, ఇండ్లు కోల్పోయిన వారే కాకుండా మండల వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతకు సైతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో 325మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడం హర్షణీయమని అదేవిధంగా మండల వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతకు సైతం ప్లాంట్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జమ్ముల కోటయ్య, లింగానాయక్, శేషయ్య, కొమ్ము రాజేష్, రాములు, రామ్మూర్తి, పాల్గొన్నారు.

### వైభవంగా ఎల్లమ్మ బోనాలు


డిండి మండల కేంద్రంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

డిండి : మండల కేంద్రంలోని ప్రజలు మంగళవారం ఎల్లమ్మ తల్లి బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనమెత్తిన మహిళలు స్థానిక ఎస్సీ కాలనీలో ఉన్న ఎల్లమ్మ దేవాలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయిలు, పెంటయ్య, వెంకటయ్య, గంగాధర్, బాలయ్య, చంద్రయ్య, యాదగిరి, కృష్ణయ్య, రామస్వామి, అంజి, గోవర్ధన్ పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతులకు తిప్పలు


పెద్దవూర : పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం పట్టాదారు పాస్‌పుస్తకాల జిరాక్స్‌లను క్యూలో పెట్టిన రైతులు


త్రిపురారం : పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు


నిడమనూరు : పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూ లైనులో రైతులు

పెద్దవూర: యూరియా కోసం రైతులకు రోజూ తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు శని, సోమ, మంగళ వారాలు యూరి యా వచ్చింది. దీంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఉదయం ఆరు గంటల నుంచే పీఏసీఎస్ వద్ద బారులు కట్టారు. యూరియా కోసం వచ్చిన రైతుల నుంచి పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డుల జిరాక్స్ పేపర్‌లను తీసుకుని ఆ తర్వాత రైతులను పిలిచి వేలు ముద్రలను నమోదు చేసుకుని డబ్బులు తీసుకుని రశీదులు ఇస్తున్నారు. ఆ తర్వాత అధికారులు వచ్చి వరుసగా వాటిని తీసుకుని రైతుకు మూడు బస్తాల యూరియాను ఇచ్చారు. వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ దగ్గరుండి ఏఈఓలతో కలిసి క్యూలో ఉన్న ప్రతి రైతుకు మూడు బస్తాల చొప్పునర యూరియాను పంపిణీ చేశారు.

**రైతులకు తీరని యూరియా కష్టాలు**

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లోని రైతులకు యూరియా సమయానికి అందక ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని త్రిపురారం పీఏసీఎస్‌కు యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు పలు గ్రామాల నుంచి వచ్చి ఉదయం 6గంటల నుంచి క్యూ లైన్‌లో నిలబడ్డారు. దీంతో పీఏసీఎస్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించి పోలీసుల పర్యవేక్షణతో ప్రతి ఆధార్ కార్డుకు 3 యూరియా బస్తాల చొప్పున పంపిణీ చేశారు. పలువురు రైతులకు యూరియా అందకపోవడంతో నిరాశగా వెనుదిగారు.

నిడమనూరు : యూరియాకోసం రైతులు ఇబ్బందులు కొనసాగుతున్నాయి. మంగళవారం సహకారం సంఘం ఎరువుల విక్రయకేంద్రం వద్ద ఉదయం 5 గంటల నుంచి యూరియాకోసం క్యూ లైన్లో నిలబడ్డారు. తొమ్మిదిగంటలకు లారీ రాగా, రెండు గంటల్లో యూరియా పంపిణీ చేశారు. లారీలో 444 యూరియా బస్తాలు రాగా, ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున 222 మంది రైతులకు పంపిణీ చేశారు. దీంతో రెండు వందలమందికి పైగా రైతులు యూరియా లేకుండానే తిరుగుముఖం పట్టారు.

### యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం


కొత్తపల్లి సొసైటీ రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా : రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మంగళవారం అనుముల మండలంలోని కొత్తపల్లి సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు బారులుదీరిన విషయం తెలుసుకున్న ఆయన రైతుల వద్దకు వెళ్లి యూరియా కోసం వచ్చిన రైతులను, చంటి పిల్లలతో వచ్చిన మహిళలను చూసి ఆయన చలించిపోయారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్న ఆయన యూరియా గురించి రైతులు పడుతున్న కష్టాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే భగత్ మాట్లాడారు. ఈకార్యక్రమంలో తిరుమలగిరి మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పిడిగం నాగయ్య, మాజీ ఎంపీపీ సుందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వద్దే సతీష్‌రెడ్డి, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, నాయకులు వెంకటయ్య, పాదిల శ్రీనివాస్, సురభి రాంబాబు, పగడోజు సైదాచారి, కాశయ్య, పెద్దిరాజు, మురళి, శంకర్, గార్లపాటి ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

### 29న డాన్‌బాస్కోలో జాబ్ మేళా

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని డాన్ బాస్కో అకాడమీలో ఈ నెల 29వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు అకాడమి డైరెక్టర్, ఫాదర్ బాలశౌరిరెడ్డి, నల్లగొండ బిషప్ థమస్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో జెన్‌పాక్ట్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పేటీఎం, హెటిరో డ్రగ్స్, మెడ్‌ప్లస్, డీమార్ట్, జెస్టు డయల్, వరుణ్‌మోటార్స్‌తో పాటు ఇతర కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు ఆయా కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను అర్హులని, ఇతర వివరాలకు 8186890929 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.